
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 5 । జనవరి । 2024



సోమశిలలో 33.12 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 33.12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 31 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,680
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,809
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,983
నవర (8 గ్రాములు)	రూ.47,864

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.3 /24.9

గురువారం గాలిలో తేమ 71 శాతం ఉంది. ఉష్ణోగ్రత తక్కువగానే ఉంటోంది. శుక్రవారం మార్పులేవీ ఉండకపోవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

విజిలెన్స్ అధికారుల విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి: పట్టణంలో హౌసింగ్ శాఖ ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన సిమెంట్ పక్కదారి పడుతుండటంతో విజయవాడకు చెందిన విజిలెన్స్ అధికారులు విచారణను గురువారం చేపట్టారు. ఉదయగిరిలోని సిమెంట్ గోదాము, ప్రభుత్వ సిమెంట్‌తో నిర్మిస్తున్న గృహం, హౌసింగ్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం విజిలెన్స్ ఈఈ భాస్కర్‌రావు, డీఈ చంద్రశేఖర్‌రాజు మాట్లాడారు. పేదలకు పంపిణీ చేయాల్సిన సిమెంట్‌ను ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ తన గృహ నిర్మాణానికి వినియోగించుకుంటున్నారనే ఫిర్యాదులు అందాయన్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదాముల్లో సిమెంట్ నిల్వలు, కార్యాలయంలోని రికార్డులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించామని చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని పేర్కొన్నారు. ఈఈ దయాకర్, ఇన్‌చార్జి డీఈ రామకృష్ణ, ఏఈ పీరా తదితరులు పాల్గొన్నారు.

13న క్రికెట్ లీగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అండర్ – 17, 23 జిల్లా క్రికెట్ లీగ్‌కు సంబంధించిన ఎంపికలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 13వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యేవారు తమ ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని కోరారు.

జగదేవిపేట పీహెచ్‌సీలో తనిఖీలు



మాట్లాడుతున్న పద్మావతి

ఇందుకూరుపేట: జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ పద్మావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవలపై రోగులను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ల్యాబ్ పరీక్షలను వైద్యశాలలో చేస్తున్నారని, అనవసరంగా డబ్బులను ఖర్చు చేసుకోవద్దని కోరారు. ల్యాబ్ పరీక్షలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జాతీయ కుష్టు నివారణ కార్యక్రమాన్ని పరిశీలించి రోగులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై చర్చించారు. తొలుత రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు సురేంద్ర, కిశోర్, నరసింహులు, హెచ్ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు.. సేవామూర్తులు

పుస్తకాలతో నిరంతరం కుస్తీ పట్టడం.. పరీక్షలను బాగా రాసి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని పరితపించే విద్యార్థులు ఇటీవలి కాలంలో సేవా కార్యక్రమాల వైపూ దృష్టి సారిస్తున్నారు. అధ్యాపకుల ప్రోత్సాహం.. ప్రముఖులిచ్చే సూచనలతో విద్యార్థులు సేవామూర్తులుగా మారుతున్నారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో చేరి ప్రత్యేక క్రమశిక్షణతో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రముఖుల మన్ననలు పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ ప్రత్యేక ప్రోత్సాహం

- సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న వైనం



వీఎస్‌యూలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

వెంకటాచలం: సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొంటూ శెభాష్ అనిపించుకుంటున్నారు. ఎన్ఎస్ఎస్ విభాగంలో చేరి తమదైన శైలిలో సేవలందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలో 130 అనుబంధ కళాశాలలుండగా, ఇందులో 93 కళాశాలల్లో 118 ఎన్ఎస్ఎస్ యూనిట్లలో 11,800 మంది విద్యార్థులు వలంటీర్లుగా ఉన్నారు.



రాష్ట్రపతి అవార్డులు పొందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న సీఎం జగన్

ప్రోత్సాహంతో మరింత ముందుకు

విద్యార్థి దశ నుంచే యువత పూర్తి స్థాయిలో అవగాహన పొంది సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పలు స్వచ్ఛంద సంస్థలు పిలుపునిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రతి కళాశాలలో విద్యార్థులను అధ్యాపకులు చైతన్యపర్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. వీఎస్‌యూ పరిధిలోని కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు చేపడుతున్నారు. కాకుటూరు, కావలిలోని వీఎస్‌యూ కళాశాలల్లో ఐదు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా వలంటీర్లు చురుగ్గా పాల్గొంటున్నారు. వీఎస్‌యూ దత్తత గ్రామాలైన కంటేపల్లి, బుజబుజనెల్లూరు, కాకుటూరు గ్రామాల్లో వైద్య, రక్తదాన శిబిరాలు, పల్స్ పోలియో కార్యక్రమాలు, పచ్చదనం – పరిశుభ్రత తదితరాల్లో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

సేవాతత్పరత

- వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో వలంటీర్లు మూడేళ్లలో సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.
- పలు కళాశాలల్లో రక్తదాన శిబిరాలను నిర్వహించి ఆరు వేల యూనిట్ల రక్తాన్ని సేకరించారు.
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో లక్షకు పైగా మొక్కలు నాటారు.
- కరోనా సమయంలో అయిన వాళ్లు ముఖం చాటేసినప్పుడు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తాము న్నామంటూ సేవలను విస్తృతంగా అందించారు.



మొక్కల చుట్టూ ఏర్పాటు చేసిన గోడలకు పెయింటింగ్ వేస్తూ..

- జిల్లాలోని పలు అనాథాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.
- దిశ యాప్, ఎయిడ్స్ వ్యాధిపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు

- వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ సేవా కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2020 – 21లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ పెళ్లకూరు సాత్విక.. 2022 – 23లో పార్థసారథి రాష్ట్రపతి అవార్డులను అందుకున్నారు. పార్థసారథిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభినందించి, సామాజిక కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని సూచించారు.
- ఇప్పటి వరకు వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ వలంటీర్ల పనితీరుతో మూడు రాష్ట్ర స్థాయి.. 16 జిల్లా స్థాయి.. మరో నాలుగు ఇతర అవార్డులు లభించాయి.
- తాజాగా రిపబ్లిక్ డే క్యాంపు – 2024కు వలంటీర్లు అనిత (వీఎస్‌యూ కళాశాల, కాకుటూరు), చందన (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట) ఎంపికయ్యారు. రిపబ్లిక్ డే క్యాంపునకు ఒక వలంటీర్ ఎంపిక కావడమే కష్టంగా ఉన్న తరుణంలో వీఎస్‌యూ నుంచి ఇద్దరు ఎంపిక కావడంపై అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంపికైన వలంటీర్లు ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.



రాష్ట్రపతి అవార్డు అందుకుంటున్న సాత్విక (ఫైల్)

వీఎస్‌యూకు గర్వకారణం



వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో వలంటీర్లు సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది రాష్ట్రపతి అవార్డులను పొందారు. వీఎస్‌యూ గర్వపడేలా రిపబ్లిక్ డే క్యాంపులో పాల్గొనేందుకు ఇద్దరు వలంటీర్లు ఎంపికవ్వడం సంతోషకరం. వీరిని స్ఫూర్తిగా తీసుకొని సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యార్థులు మరింత ఆసక్తి చూపాలి.

– సుందరవల్లి, వీసీ, వీఎస్‌యూ

పింఛన్ నగదు పెంపు చరిత్రాత్మకం



పింఛన్ నగదు, మంజూరు పత్రాన్ని అందజేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్లను రూ.మూడు వేలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని, ఇది చరిత్రాత్మకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక.. నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి గురువారం హాజరై మంత్రి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి విడతల వారీగా పింఛన్ మొత్తాన్ని పెంచిన ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. సచివాలయాల ద్వారా అర్హులకు పింఛన్లను పారదర్శకంగా మంజూరు చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం మూడు రెట్లు అదనంగా పెంచి లబ్ధిదారులకు అందిస్తోందని వివరించారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చర్మకారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కిడ్నీ బాధితులకు పింఛన్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, పేడూరు సొసైటీ అధ్యక్షుడు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, నేతలు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, మన్నెం చిరంజీవులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో నూతన పథకం ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బ్యాంక్ డిపాజిట్లపై అధిక వడ్డీని అందజేసే సహకార నేస్తం పథకాన్ని నగరంలోని డీసీసీబీ ప్రధాన పరిపాలన కార్యాలయంలో బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 60 ఏళ్లలోపు వారికి 7.75.. 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీని అందజేయనున్నామని చెప్పారు. 80 ఏళ్లు నిండిన సూపర్ సీనియర్ సిటిజన్లకు అత్యధికంగా 8.5 శాతం వడ్డీని ఇవ్వనున్నామని వెల్లడించారు. రూ.పది వేల నుంచి ఎంత మొత్తాన్నైనా డిపాజిట్ చేయొచ్చని, 444 రోజుల కాలపరిమితి ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా రూ.50 కోట్ల మేర డిపాజిట్లను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని డీసీసీబీ బ్రాంచ్‌లలో ప్రవేశపెట్టామన్నారు. డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, జీఎం సరిత, డీజీఎంలు ఉషారాణి, నాగేంద్రకుమారి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

పల్లెకు పోదాం చలో.. చలో



సందడి చేస్తున్న విదేశీయులు

- విదేశీయుల ఆటో యాత్ర
- కేరళ నుంచి మేఘాలయకు..

మనుబోలు: భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలు, భౌగోళిక అందాలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలుసుకున్న కొందరు విదేశీ యువకులు ఆటోల్లో దేశ యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మనుబోలు సమీపంలోని మెక్‌డొనాల్డ్స్ వద్ద కొద్దిసేపు గురువారం ఆగారు. ఈ సమయంలో అక్కడే ఉన్న ఎంఈఓ శేషాద్రివాసు వీరిని పలకరించి యాత్ర విశేషాలు తెలుసుకున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇటలీ, ఇంగ్లండ్‌కు చెందిన లారెన్స్, ఫెడరిక్, లోరెన్, జైపో, మైకో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్నేహితులయ్యారు. సామాజిక మాధ్యమాల ద్వారా భారత్ గురించి కొంత తెలుసుకొని ఆసక్తిగా అనిపించడంతో నేరుగా వెళ్లి చూడాలని నిర్ణయించుకున్నారు. దీంతో డిసెంబర్ 26న కేరళ చేరుకున్నారు. కొచ్చిలో రెండు ఆటోలను కొనుగోలు చేసి.. రిక్షా రన్ ఇండియా పేరిట యాత్రను జనవరి ఒకటిన ప్రారంభించారు. అక్కడి నుంచి పర్యాటక ప్రాంతాలు, సాంస్కృతిక, పురాతన కట్టడాలను వీక్షిస్తూ.. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ మనుబోలు చేరుకున్నారు. మేఘాలయలోని షిల్లాంగ్ వరకు యాత్రను కొనసాగిస్తామని తెలిపారు. భారత్‌లోని సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, దైవభక్తి, ప్రకృతి సోయగాలు తమకెంతో నచ్చాయని తెలిపారు. తమ అనుభవాలను కెమెరాల్లో బంధించి సామాజిక మాధ్యమాల ద్వారా తమ దేశస్తులు, ప్రపంచానికి తెలియజేస్తామన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమం

నెల్లూరులోని మూలాపేటకు చెందిన రవిశంకర్ దివ్యాంగుడు. పింఛన్ కోసం గత ప్రభుత్వ హయాంలో చేయని ప్రయత్నం లేదు. ప్రస్తుతం ఈయన ఇంటికే వలంటీర్ వచ్చి వివరాలను అప్‌లోడ్ చేశారు. మరుసటి నెలలో పింఛన్ మంజూరవడంతో రవిశంకర్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

ఏసీనగర్‌కు చెందిన మోహన్‌రావు వ్యాపారం చేస్తూ పది మందికి ఉపాధి కల్పించారు. వ్యాపారం దెబ్బతిని అప్పులపాలై అనారోగ్యానికి గురయ్యారు. రేషన్ కార్డు, పింఛన్ కోసం గత ప్రభుత్వ హయాంలో రెండేళ్లు తిరిగినా ప్రయోజనం లభించలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ రెండూ మంజూరయ్యాయి.

గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు పొందాలంటే అదో ప్రహసనంలా ఉండేది. లబ్ధిదారులు తమ పనులు మానుకొని కార్యాలయాలకు వెళ్లి పింఛన్లు, రేషన్ కార్డుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఒకవేళ ఓర్పుతో గంటల తరబడి నిరీక్షించినా అవి అందుతాయనే గ్యారెంటీ లేదు. ప్రజలు పడుతున్న కష్టాలను గమనించిన జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించి ప్రజలు పడుతున్న కష్టాలకు చెక్ పెట్టారు.

- ఠంచనుగా పింఛన్లు
- రేషన్ కార్డులూ గృహం వద్దకే..
- ప్రదక్షిణలకు చెక్
- అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటి వద్దే అందజేస్తుండటంతో లబ్ధిదారులు ఖుషీఖుషీగా ఉన్నారు. లబ్ధిదారులు తమ వివరాలను దరఖాస్తుల్లో నింపి కార్యాలయాల్లో అందజేసే విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టారు. ఈ విధానం ద్వారా పింఛన్లు, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు సజావుగా అందుతున్నాయి. పార్టీలు.. కులమతాలకతీతంగా అర్హులకు అందిస్తున్నారు.

వలంటీర్ల వ్యవస్థతో సజావుగా..

వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు సజావుగా అందుతున్నాయి. రేషన్‌కార్డుదారులకు ప్రతి నెలా రూ.49 కోట్లు వెచ్చించి సరుకులను రేషన్ వాహనాల ద్వారా ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నారు. పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా దాదాపు రూ.96 కోట్ల సాయాన్ని అందిస్తున్నారు.



మనుబోలు దళితవాడలో వృద్ధురాలికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ మల్లికార్జున

గతానికీ.. నేటికీ మధ్య వ్యత్యాసం ఇదీ..

గత ప్రభుత్వాల హయాంలో కొత్త పింఛన్లు మంజూరు చేయాలంటే అనేక కొర్రీలు పెట్టేవారు. పింఛన్ పొందుతున్న వారు ఎవరైనా మరణిస్తే ఆ స్థానంలో ఇంకొకరికి మంజూరు చేసేవారు. జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు తదితరాలు అందేవి. జన్మభూమి కమిటీలు సిఫార్సు చేయకుండా వీటిని మంజూరు చేసే అధికారం కలెక్టర్లకు సైతం లేదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఇలాంటివేవీ లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సజావుగా అందిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మండలాలు:	జనాభా:
37	26 లక్షల మంది
వలంటీర్లు: సుమారు 12,700	పింఛన్ లబ్ధిదారులు: 3,19,952
రేషన్ కార్డులు: 6.35 లక్షలు	

పెన్షన్.. నో టెన్షన్

గత టీడీపీ హయాంలో ప్రతి నెలా ఐదారు తేదీల తర్వాతే పింఛన్ నగదును అందజేసేవారు. అయితే ప్రస్తుతం ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి తలుపుతట్టి వైఎస్సార్ పింఛన్ కానుక నగదును అందజేస్తున్నారు. లబ్ధిదారులు హాస్పిటల్లో వైద్యసేవలు పొందుతున్నా.. ఎక్కడ ఉంటే అక్కడికే వలంటీర్లు వెళ్లి నగదును పంపిణీ చేస్తున్నారు.

10,500 కొత్త పింఛన్ల మంజూరు

జిల్లాలోని 3,19,952 మంది వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.96 కోట్ల సాయాన్ని పంపిణీ చేస్తున్నాం. ప్రతి నెలా ఒకటి నుంచి ఐదో తేదీ వరకు నగదును అందజేస్తున్నాం. నూతన సంవత్సరంలో 10,500 కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

– సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్డీఏ

ఆన్‌లైన్లో దివ్యాంగుల పోస్టుల అర్హుల జాబితా

నెల్లూరు (వేదాయపాళెం): విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టులు గ్రూప్ – 4, క్లాస్ – 4 విభాగాల్లో పది పోస్టులకు సంబంధించిన అర్హుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు అక్బర్ అలీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. spsnellore.ap.gov.in/notice_category/recruitmentలో అర్హులు.. అనర్హుల జాబితాను పొందుపర్చామని చెప్పారు. ఏమైనా అభ్యంతరాలుంటే కొండాయపాళెం రోడ్డులోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. వివరాలకు 0861 – 2329581 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రాభివృద్ధే జగనన్న ప్రభుత్వ లక్ష్యం



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: రాష్ట్రాభివృద్ధే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. గురువారం ఏఎస్‌పేట మండల కేంద్రంలో ఆయన పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేస్తున్నారన్నారు. వారు ప్రజల ముంగిటకే వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. దీనిని చూసి టీడీపీ ఓర్వలేక వలంటీర్ల వ్యవస్థపై కుట్రలు పన్నుతోందన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం ఏమీ చేయలేదన్నారు. వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సంక్షేమ పాలన ప్రచార బాధ్యత ప్రజలే తీసుకోవాలన్నారు. అవ్వాతాతలకు రూ.3 వేలు పింఛన్‌ను ప్రభుత్వం అందిస్తుండడంతో వారు ఆనందంగా ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో సైతం అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ వచ్చేలా చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో రాజకీయం చేసిందన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా ఇస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, ఎంపీడీఓ భాస్కర్, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కాటంరెడ్డి నారసింహారెడ్డి, జిలాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది అవినీతి పాలన



ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో మాట్లాడుతున్న పింఛన్ లబ్ధిదారు షీబారాణి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (విడవలూరు): 'చంద్రబాబు 14 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన పాలనంతా అవినీతిమయం.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. విడవలూరు మండలంలో గురువారం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేదవాడికి మంచి చేసి తోడుగా ఉండటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలుసన్నారు. సంక్షేమ ప్రభుత్వం రాకముందు చంద్రబాబు రాక్షస పాలనలో ఏనాడు కూడా ప్రజలు సంతోషంగా లేరన్నారు. నాలుగేళ్లకు పైగా ప్రజలను కన్నెత్తి చూడని బాబు ఎన్నికలు సమీపిస్తుండటంతో అపారమైన ప్రేమ చూపిస్తున్నాడన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా చనిపోతే తప్ప కొత్త పెన్షన్ మంజూరయ్యేది కాదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా పింఛన్ ఇస్తున్నట్లు చెప్పారు. బాబు పాలనలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వకపోతే పెన్షన్ మంజూరయ్యేదికాదన్నారు. విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన జి.షీబారాణి మాట్లాడుతూ గతంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న రాలేదని, జగనన్న ప్రభుత్వంలో మంజూరైందని చెప్పారు. నా కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు జగనన్నకు మద్దతుగా ఉంటానని చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, సెట్నెల్ సీఈఓ నాగరాజకుమారి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య తదితరులు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నేత నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ పెంపుతో ఆనందంగా లబ్ధిదారులు



పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో మేకపాటి, నాయకులు

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను పెంచడంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ పెన్షన్ కానుకను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధే తమ కుటుంబ లక్ష్యమన్నారు. టీడీపీ పాలనలో పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ పెన్షన్లు ఇస్తున్నారన్నారు. వృద్ధులకు కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. నవరత్నాలను ప్రవేశపెట్టి ప్రజా మన్ననలు పొందుతున్నారన్నారు. టీడీపీ పాలనలో సీఎం నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు దోచుకున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొత్త వ్యక్తులు వస్తుంటారని, వారిని నమ్మొద్దని, అందుబాటులో ఉంటూ సేవ చేసే వారిని గుర్తించాలని ప్రజలను కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్, ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీ అహ్మద్, కో–ఆప్షన్ సభ్యుడు జిలానీబాషా, డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు డి.ఎర్రా ఓబయ్య, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన విద్య అందించండి

- డీఈఓ గంగా భవాని



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

రాపూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డీఈఓ గంగాభవాని తెలిపారు. మండలంలోని గోనుపల్లె, పెనుబర్తి, ఉన్నత పాఠశాలలు, తెగచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించిందని, ప్రతి ఉపాధ్యాయుడు వాటి ద్వారానే బోధన చేయాలని సూచించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాసులు, జిలానీబాషా పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే వేడుకలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థి



కీర్తన్‌పాల్

కోట: విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అభిషయ్ కీర్తన్ పాల్ జనవరి 26వ తేదీన న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎన్‌సీసీలో ప్రతిభ చూపిన అభిషయ్ కీర్తన్ పాల్ రిపబ్లిక్‌డే వేడుకలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): వివాహితను అదనపుకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటి వారిపై నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీనగర్ ఆటోస్టాండ్ ప్రాంతానికి చెందిన సుమతికి రెండేళ్ల క్రితం చిట్టమూరు మండలానికి చెందిన మహేష్‌తో వివాహమైంది. ఆ సమయంలో సుమతి తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, ఆరు సవర్ల బంగారాన్ని కట్నం కింద అందజేశారు. కొద్దిరోజులు సుమతి, మహేష్‌ల దాంపత్యం అన్యోన్యంగా సాగింది. అనంతరం విభేదాలు చోటుచేసుకున్నాయి. భర్త, అత్తింటి వారు ఆమెను అదనపుకట్నం కోసం వేధించసాగారు. కొంతకాలం క్రితం సుమతి తన తండ్రి అనారోగ్యంగా ఉండడంతో చూసేందుకు పుట్టింటికి వచ్చింది. తిరిగి అత్తింటికి వెళ్లగా వారు అదనపుకట్నం తీసుకొస్తేనే కాపురానికి రావాలని చెప్పారు. భర్త, అత్తింటి వారి వేధింపులు తాళలేని బాధితురాలు గురువారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	95
లేయర్ (లైవ్) :	90
బ్రాయిలర్ చికెన్ :	180
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	200
లేయర్ చికెన్ :	153



నిమ్మధరలు (కిలో)

పెద్దవి :	రూ.30
సన్నవి :	రూ.22
పండ్లు :	రూ.7



పేదల గుండెల్లో సీఎంకు ప్రత్యేక స్థానం



మాజీ ఎంపీపీకి పింఛన్ అందజేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

- కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

ఉలవపాడు: 'ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. వారంతా ఆయనపై అంతులేని ప్రేమ చూపిస్తున్నారు.' అని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌దే అన్నారు. అందుకే ప్రజలు ఆయన్ను గుండెల్లో పెట్టుకున్నారన్నారు. ఉలవపాడు మండలంలో గతంలో 6,809 పింఛన్లు అందిస్తే ప్రస్తుతం 8,730 ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు మాటల దాడులు చేస్తున్నాయని, అయితే ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తారన్నారు. ప్రతిపక్షాలు కలిసి పోటీ చేస్తామనడంతోనే వారి స్థాయి అర్థమవుతుందన్నారు. నూతనంగా మంజూరైన 262 పింఛన్లను ఎమ్మెల్యే అందజేశారు. కాగా గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ ఎంపీపీగా చేసిన జువ్విగుంట చిన్నమ్మికి ఈ ప్రభుత్వం పింఛన్ అందించింది. కార్యక్రమంలో డీఎల్‌డీఓ పద్మజ, ఎంపీపీ మస్తానమ్మ, జెడ్పీటీసీ అరుణ, ఎంపీడీఓ విజయ, తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, ఈఓపీఆర్డీ చెంచమ్మ, వైస్ ఎంపీపీ రమణయ్య, సర్పంచ్ నాగలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



చెన్నారాయినిపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట: సంక్షేమ పథకాల అమలులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు సొంత పంచాయతీ చెన్నారాయినిపాళెంలో పెన్షన్ పెంపు ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రామిరెడ్డి పెరిగిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పేదల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. పాదయాత్ర సందర్భంగా పేదల కష్టాలు స్వయంగా తెలుసుకున్న ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పేరుతో సంక్షేమశకానికి నాంది పలికారన్నారు. నిరుపేదలకు అన్ని వసతులతో కూడిన లేఅవుట్లు ఏర్పాటు చేసి స్థలాలు పంపిణీ చేయడంతోపాటు పక్కాఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. పింఛన్లతో వృద్ధాప్యంలో ఉన్న అవ్వాతాతలకు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, సర్పంచ్ కొండూరు గిరి బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, వైఎస్సార్‌సీపీ మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, నాయకులు తూపిలి పెంచలయ్య, తుమ్మల రమణయ్య, పవన్ రెడ్డి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సూచనలు, ఆదేశాలిచ్చారు. నెల్లూరు నుంచి కలెక్టర్ ఎం.హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, డీపీఓ సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు వెంకట్రావు, హేన సుజన, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఆరోగ్యశ్రీ యాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలని సీఎస్ ఆదేశించారు. ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి?, సేవలు ఎలా పొందాలి? తదితర సందేహాలను ప్రతి ఇంట్లోనూ వివరించే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రీసర్వే ప్రక్రియపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షకు మొత్తం 319 మంది విద్యార్థులకు గానూ 281 మంది హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. నెల్లూరు నగరంలో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు తెలియజేశారు.

సాధికార యాత్ర విజయవంతానికి పిలుపు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

రాపూరు: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రాపూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద సభకు సంబంధించిన పనులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దెలమడుగు నుంచి రాష్ట్ర నాయకులకు భారీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి రాపూరు వరకు ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశామని, కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వెలుపల భారీ స్టేజీ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శశిరెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, పిచ్చిరెడ్డి, సంజీవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

కందుకూరు రూరల్: ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. కత్తితో గొంతులో పొడిచి చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంట గ్రామంలో మందలపు శేషమ్మ (67) నివాసం ఉంటోంది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం మరణించాడు. కొడుకు విదేశాల్లో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె హైదరాబాద్‌లో ఉంటోంది. గత రెండురోజుల నుంచి ఆమె ఇంటి తలుపు వేసి ఉంది. బయట కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఏదో జరిగిందని అనుమానం రావడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కందుకూరు రూరల్ ఎస్సై తిరుపతయ్య తన సిబ్బందితో వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా వృద్ధురాలి గొంతులో కత్తితో పొడిచి, పైన దుప్పటి కప్పి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ హత్య గ్రామంలో కలకలం రేపింది. ఆ ఇంట్లో చిన్న వస్తువు కూడా చోరీ కాలేదు. దీంతో వృద్ధురాలిని హత్య చేయాల్సినంత అవసరం ఏమై ఉంటుందని తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

గాయపడిన డిజిటల్ అసిస్టెంట్ మృతి

గుడ్లూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలులో చికిత్స పొందుతున్న డిజిటల్ అసిస్టెంట్ కీర్తి కృష్ణ (33) గురువారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. ఉలవపాడుకు చెందిన కీర్తి కృష్ణ మండలంలోని మోచర్ల సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని తన మోటార్‌బైక్‌పై ఉలవపాడుకు వెళ్తున్న సమయంలో వెనుక నుంచి కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కృష్ణను ఒంగోలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు.